# మరో అవకాశమివ్వండి..



మున్సిపల్ పార్క్‌లో వాకర్స్‌కు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్



బోర్నపల్లిలో ప్రజలను కలిసి ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి సంజయ్ కుమార్

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్
- రాయికల్ మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం

రాయికల్, నవంబర్ 28: బీఆర్ఎస్ పార్టీతోనే అభివృద్ధి, ఇంటింటా సంక్షేమం సాధ్యమవుతుందని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు తనకు మరొక్క అవకాశం ఇచ్చి గెలిపించాలని ఆ పార్టీ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. రామాజీపేట, వడ్డెలింగాపూర్, చింతలూర్, బోర్నపల్లి, కుమ్మరిపల్లి గ్రామాల్లో డాక్టర్ సంజయ్ కుమార్ మం గళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రా మాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి సంజయ్ ప్రజలను కలిసి తనకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వరాష్ట్రంలో ప్రజల కండ్లముందే అభివృద్ధి కనబడుతున్నదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందని ఇల్లు లేదన్నారు. మన పథకాలు దేశానికే ఆదర్శం అని కొనియాడారు. తెలంగాణ రాష్ట్రం వచ్చి న తర్వాత రైతులకు కరెంటు కష్టాలు లేవని, వ్యవసాయానికి 24 గంటల కరెంటు, రైతుబంధు, సకాలంలో ఎరువులు, విత్తనాలు ఇస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతున్నదన్నారు. బోర్నపల్లి బ్రిడ్జిని నిర్మించి ఇక్కడ ప్రజల కల ను సహకారం చేసిన ఘనత బీఆర్ఎస్ పార్టీకి దక్కుతున్నదన్నారు. బోర్నపల్లి బ్రిడ్జి నిర్మాణం వల్ల అంతర్ జిల్లాల రాకపోకలతో ఇక్కడి గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. పదేళ్ల క్రితం తెలంగాణలోని పల్లెలు ఏ విధంగా ఉండే..? రాష్ట్రం ఏర్పడిన తర్వాత పల్లెలు ఏ విధంగా అభివృద్ధి చెందాయో ప్రజలు గమనించాలన్నారు. ఎన్నికల వేళ కాంగ్రెస్, బీజేపీల మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు తనను ఆశీర్వదించి మరోసారి జగిత్యాల ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని ఎమ్మెల్యే అభ్యర్థి కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ సంధ్యారాణి, జడ్పీటీసీ జాదవ్ అశ్విని, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రాణి, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, సర్పంచులు రమాదేవి-మోహన్, రవి, శ్రీనివాస్, లత, రాజు, స్వప్న-వెంకటేశ్వరరెడ్డి, ఎంపీటీసీలు నాగరాజు, కవిత, ఉప సర్పంచులు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

**అభివృద్ధి, సంక్షేమం, ఆరోగ్య పరిరక్షణకు కృషి**

జగిత్యాల కలెక్టరేట్, నవంబర్ 28: రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంతో పాటు ప్రజల ఆరోగ్య పరిరక్షణకు సైతం ప్రత్యేక చర్యలు చేపట్టిందని, దీనిలో భాగంగానే జగిత్యాలలో వ్యాయామం కోసం ఓపెన జిమ్ములు.. నడకకు వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేశామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల పట్టణంలోని మున్సిపల్ పార్కులో వాకర్స్‌ను మంగళవారం ఉదయం సంజయ్‌కుమార్ కలిసి జగిత్యాలలో చేసిన అభివృద్ధి, అందించిన కార్యక్రమాలను వాకర్స్‌కు వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పట్టణ వాసులు శారీరకంగా దృఢంగా ఉండేందుకు పట్టణంలో పలు ప్రాంతాల్లో ఓపెన్ జిమ్ములు ఏర్పాటు చేశామని, పార్కులను అభివృద్ధి చేశామని, జగిత్యాల పట్టణాన్ని అన్ని రంగాల్లో పట్టణాల కంటే ఎక్కువగా అభివృద్ధి చేశామన్నారు. సరైన విధంగా క్రీడా ప్రాంగణాలు లేవని, కేవలం ఒకే ఒక్క స్టేడియం ఉండేదని, దీనిని దృష్టిలో ఉంచుకొని పట్టణంలో పలు ప్రాంతాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశామని చెప్పా రు. జగిత్యాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని, ఎళ్లవే లలా ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కరిస్తున్న తనను, మరోసారి ఆశీర్వదించి కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ధరూర్ క్యాంపు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, వాకర్స్, స్థానికులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలో మేరు సంఘం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రమణతో హాజరై మాట్లాడారు. కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. అదే విధంగా 17వ వార్డులో ప్రచారం నిర్వహించి ఓటు అభ్యర్థించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, వాకర్స్, వార్డు ప్రజలు, మేరు సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# కారు గుర్తుకే ఓటెయండి

- బీఆర్ఎస్ అభ్యర్థి సంజయ్ కుమార్ సతీమణి రాధిక ప్రచారం
- పలు గ్రామాల్లో నాయకుల ప్రచారం



రేచపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సతీమణి రాధిక, నాయకులు

సారంగాపూర్, నవంబర్ 28: ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను మరోసారి ఆశ్వీరించాలని ఆయన సతీమని రాధిక అన్నారు. రేచపల్లి గ్రామంలో మంగళవారం స్థానిక నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామాల్లో ఎవరి హయాంలో అభివృద్ధి జరిగింది.. ఎవరెం చేశారో ప్రజలు ఒక్కసారి ఆలోచించుకొని ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల కోసమే పనిచేస్తున్న డాక్టర్ సంజయ్ కుమార్‌ను రెండోసారి ఆశీర్వదించాలని కోరారు. ఎన్నికల ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్యే సతీమణి రాధికకు ప్రజాప్రతినిధులు, మహిళలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమం లో జడ్పీటీసీ మేడిపెల్లి మనోహర్ రెడ్డి, సర్పంచ్ ఎడమల జయ-లక్ష్మారెడ్డి, ఎంపీటీసీ భూక్యా లావణ్యా రాథోడ్, ఉప సర్పంచ్ రాచకొండ రాజేశం, యూత్ అధ్యక్షుడు మదన్ కుమార్, గ్రామ అధ్యక్షుడు సాతాల్ల రమేశ్, మాజీ అధ్యక్షుడు ఒడ్నాల జగన్ తదితరులు పాల్గొన్నారు.

**గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు**

కోనాపూర్ గ్రామంలో ఎంపీపీ కోల జమున ప్రచారం చేశారు. కారు గుర్తుకే ఓటెయాలని విజ్ఞప్తి చేశారు. రేచపల్లి గ్రామం లో జడ్పీటీసీ మనోహర్ రెడ్డి, సర్పంచ్ ఎడమల జయ-లక్ష్మారెడ్డి, ఎంపీటీసీ లావణ్య రాథోడ్, ఉప సర్పంచ్ రాచకొండ రాజేశం ప్రచారం చేశారు. డాక్టర్ సంజయ్ కుమార్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమాల్లో జిల్లా కేడీసీసీబీ డైరెక్టర్ ముప్పాల రాంచందర్ రావు, వైస్ ఎంపీపీ సొల్లు సురేందర్, సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల బీఆర్ఎస్ అధ్యక్షులు గుర్రాల రాజేందర్ రెడ్డి, నారపాక రమేశ్, ప్రధాన కార్యదర్శులు తోడేటి శేఖర్ గౌడ్, శీలం రమేశ్, ఉపాధ్యక్షుడు రామకిష్టు గంగాధర్, శ్రీనివాస్ రావు, ఆర్‌బీఎస్ కన్వీనర్లు కోల శ్రీనివాస్, మేరుగు రాజేశం, విండో చైర్మన్లు గురునాథం మల్లారెడ్డి, ఏలేటి నర్సింహా రెడ్డి, యూత్ అధ్యక్షుడు సిలివేరి మదన్‌కుమార్, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



కోనాపూర్‌లో ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎంపీపీ కోల జమున, మహిళలు



మాట్లాడుతున్న కలెక్టర్. పక్కన ఎస్పీ

## ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

**ప్రశాంత వాతావరణంలో ఓటు వేసేలా చర్యలు**

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ యాస్మిన్ బాషా**

జగిత్యాల, నవంబర్ 28: జిల్లాలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్, అదనపు కలెక్టర్ బీఎస్ లతతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల నియోజకవర్గాల్లో 78 రూట్లలో మొత్తం 785 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. అంతేకాకుండా జిల్లాలో 234 మంది మైక్రో అబ్జర్వర్లతో పాటుగా నిరంతర పర్యవేక్షణ కోసం 992 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని చెప్పారు. అలాగే హోం ఓటింగ్ విధానంలో 1141 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని వెల్లడించారు. జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ బుధవారం కూడా కొనసాగుతుందని, అందుకు సంబంధించిన వారు రిటర్నింగ్ అధికారిని సంప్రదించి పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. 36 మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఇందుకు సంబంధించి బుధవారం సాయం త్రం కల్లా ఏర్పాట్లు పూర్తి కానున్నాయని వెల్లడించారు. కాగా భారత ఎన్నికల కమిషన్ రూపొందించిన సీ విజిల్ యాప్‌కు మంచి స్పందన లభించిందని, ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఉపయోగపడుతుందని వివరించారు. ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ, జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో 161 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, అలాగే 10 కంపెనీల కేంద్ర బలగాలతో కూడిన సివిల్ పోలీస్ సిబ్బంది 3 వేల మంది ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహణకు ఏర్పాటు చేశామని వివరించారు. ఎన్నికల సమయంలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్ట్‌ల నుంచి వాహనాల తనిఖీల ద్వారా ఇతరత్రా తనిఖీల ద్వారా సుమారు రూ.259 కోట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. 30న జరగనున్న పోలింగ్‌కు సంబంధించి మంగళవారం సాయంత్రం ఐదు గంటల నుంచి ఎలాంటి ప్రచార కార్యక్రమాలు చేపట్టకుండాచర్యలు తీసుకున్నామన్నారు. ఎన్నికల ప్రశాంత నిర్వహణకు అన్ని వర్గాల వారు సహకరించాలని ఈ సందర్భంగా ఎస్పీ సన్ ప్రీత్‌సింగ్ కోరారు.

## స్వేచ్ఛాయుతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

- ఎన్నికలకు భద్రతా ఏర్పాట్లు పూర్తి
- జిల్లా పరిధిలో 144 సెక్షన్ అమలు
- ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ వెల్లడి

జగిత్యాల, నవంబర్ 28: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి శుక్రవారం ఉదయం 7 గంటల వరకు జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. శాంతియుత వాతవారణంలో ఎన్నికలు నిర్వహించడానికి జిల్లా, కేంద్ర పోలీస్ బలగాలతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని చెప్పారు. ఎన్నికల సంఘం నియమ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ తూ.చ తప్పకుండా ఎన్నికల నిబంధనలు పాటించాలన్నారు. ఎన్నికల కమిషన్ నియమావళి పాటిస్తూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్పీ కోరారు. ఓటర్లను ప్రలోభ పెట్టడానికి డబ్బులు, మద్యం, ఇతర వస్తువులు తీసుకొని వెళ్తున్నట్లు సమాచారం ఉంటే డయల్ 100కు లేదా సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.